విద్యార్థులు ఇష్టంతో చదవాలి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి




విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను ఛేదించేందుకు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చంపాపేటలోని మందా యాదవరెడ్డి ఫంక్షన్ హాల్లో బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(బీఎస్‌ఎమ్‌ఏటీ) ఆధ్వర్యంలో యువ జూనియర్ కళాశాల సౌజన్యంతో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్–2025 క్రీడల విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఎస్‌ఎమ్‌ఏటీ పాఠశాలల నిర్వాహకులు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తూనే సరూర్‌నగర్ మండల స్థాయిలో ప్రైవేట్ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు పలు క్రీడా పోటీలను నిర్వహించటం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం ఆయన చేతులమీదుగా బీఎస్‌ఎమ్‌ఏటీ అధ్యక్షుడు శ్రీపతి శ్రీనివాసరెడ్డితో కలిసి విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, భారత్‌కుమార్, మీనేందర్‌రావు, భాస్కర్, దేవేందర్‌గౌడ్‌మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నాలాల కబ్జాపై హైడ్రా దృష్టి పెట్టేనా?

మాదన్నపేటలో కనుమరుగైన నాలా
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- మార్కెట్‌లో నిలుస్తున్న నీరు



మాదన్నపేట నాలాను సూచిస్తున్న మ్యాప్

చంచల్‌గూడ: నగరంలో చాలా చోట్ల ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జాలకు గురయ్యాయి. కొందరైతే ఏకంగా నాలాలపై బహుళ అంతస్తుల భవనాలు కట్టేశారు. కొన్ని చోట్ల నాలాలను పూడ్చేస్తున్నట్లు ఇటీవల హైడ్రా ఏర్పాటుతో వెలుగులోకి వస్తున్నాయి. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న ఇలాంటి వ్యవహారాలను హైడ్రా రాకతో పరిష్కారమవుతున్నాయి. ప్రభుత్వ భూములు, నాలాలు, పార్కులు కబ్జాకు గురైన ఎన్ని ఫిర్యాదులు చేసినా జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం చేసిందనే అపవాదును హైడ్రా అధిగమిస్తుంది. కుర్మగూడ డివిజన్ మాదన్నపేట కూరగాయాల మార్కెట్ సరిహద్దుల్లో పెద్ద నాలా ఉండేది. ఈ నాలా మాదన్నపేట మండీ నుంచి బడా బజార్ మీదుగా మూసీ నదిలో కలిసేదని స్థానికులు చెబుతున్నారు. నాలా కబ్జాలతో డివిజన్‌లోని భరత్‌నగర్, పలు మైనార్టీ బస్తీల్లో వర్షాకాలంలో వరదనీరు చేరుతుందని బస్తీ వాసులు వాపోతున్నారు. నాలాల కబ్జాలపై గతంలో అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది.

అధికారుల జాడ లేదు..

నాలాల కబ్జాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని గత ప్రభుత్వ హయాంలో వెల్లడించారు. కానీ వారి మాటలు కార్యరూపం దాల్చలేదు. నగరంలో నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాలను గుర్తించే పని జీహెచ్‌ఎంసీకి అప్పగించినా అధికారులు మాత్రం తూతూమంత్రంగా చర్యలు చేపట్టారు. కుర్మగూడ డివిజన్ మాదన్నపేటలో కబ్జాకు గురైన నాలాల వైపు అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడం వారి పనితనానికి నిదర్శనంగా మారింది. మాదన్నపేట ప్రాంతంలో నాలాల కబ్జాకు గురవడంతో వరదనీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. ఈ ప్రాంతంలో కబ్జాకు గురైన నాలాపై సుమారు 10 అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిని ఉపేక్షించేది లేదని గత ప్రభుత్వంలో మంత్రులుగా పని చేసిన వారు వీలు చిక్కినప్పుడల్లా ఉపన్యాసాలు ఇచ్చారని ప్రస్తుత ప్రభుత్వం, హైడ్రా ఈ అంశంపై ఏ విధంగా స్పందిస్తుందోనని స్థానికులు వేచి చూస్తున్నారు.

హైడ్రాపై ఆశలు..

మండీలో పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోవడంతో రైతులు, వ్యాపారులు తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఓ పక్క రైతే రాజు అని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు మాదన్నపేట మార్కెట్‌లోని సమస్యలు కనిపించడం లేదా అని రైతులు, వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. మార్కెట్ చుట్టూ ఉన్న నాలా కబ్జాకు గురి కావడంతో వరదనీరు నెలల తరబడి మార్కెట్‌లో నిలిచిపోతున్నాయి. మరో పక్క డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. కేవలం చినుకులకే కుంటలా మారి వర్షాకాలం మొత్తం ఇబ్బందులు పడటం సర్వ సాధారణమైంది.

నాలాలపై నిర్మాణాలను తొలగించాలి



నాలాల కబ్జాలతో వరదనీరు కూరగాయల మార్కెట్‌లోకి చేరుతుండటంతో మురుగు కుంటగా ఏర్పడి రైతులు, బస్తీవాసులు, వ్యాపారులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మాదన్నపేట మండీ చుట్టుపక్కల నాలాలపై వెలిసిన అక్రమ నిర్మాణాలను తక్షణమే తొలగించాలి. హైడ్రా కమిషనర్ మాదన్నపేట మండీని సందర్శిస్తే అక్కడి పరిస్థితి స్పష్టంగా అర్థమవుతుంది.
–సహదేవ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్

ఆకట్టుకున్న ఎడ్యుకేషన్ ఫెయిర్



లింగోజీగూడ: ఎల్‌బీనగర్ కాకతీయనగర్ కాలనీలోని కాకతీయ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్ ఆకట్టుకుంది. ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్, క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మాధవి విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించి అభినందించారు.

ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి



చైర్మన్ వీరయ్యకు వినతిపత్రం ఇస్తున్న శ్రీను

చాదర్‌ఘాట్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని దివ్యాంగుల సంఘం నాయకుడు నల్గొండ శ్రీను కోరారు. చత్తీస్‌గఢ్ రాజస్థాన్ రాష్ట్రాల్లో వికలాంగులకు స్థానిక సంస్థల్లో నామినేటెడ్ అవకాశాలు ఇచ్చారన్నారు. మంగళవారం అందుకు సంబంధించిన గెజిట్ చట్టాల ప్రతులను వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వీరయ్యకు సమర్పించారు. తెలంగాణాలోనూ అవకాశమిస్తే 26 వేల మంది దివ్యాంగులకు రాజకీయ అవకాశాలు దక్కుతాయన్నారు.

పత్తి సాగుకు కేంద్రం ఆర్థిక సాయం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

మన్సూరాబాద్: పత్తిసాగును ప్రోత్సాహించడానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని ఐసీఏఆర్ అటారీ, డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి హయత్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని ఈ–సెర్ప్ ఫామ్‌లో కేవీకేలో వ్యవసాయం–పర్యావరణం, సాంకేతికలపై మంగళవారం నిర్వహించిన కిసాన్ మేళాను నర్సింహారావు, ఎస్కే బాల్, సుజాతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీరా మాట్లాడుతూ.. పంటల ఉత్పాదనలో గణనీయమైన మార్పులతో సాగు ఖర్చులను తగ్గించటానికి అవలంభిస్తున్న పద్ధతులతో దిగుబడి పెరుగుతుందన్నారు. హైడెన్సిటీ ప్లాంటింగ్ సిస్టం (హెచ్‌డీపీఎస్) కింద సూచనలు పాటించి మంచి దిగుబడిని పొందిన రైతులను ఆయన అభినందించారు. పత్తి ఉత్పాదకతను పెంచడానిక ఉత్తమ పద్ధతులపై ప్రదర్శనలు నిర్వహించారు. తెగుళ్లు, వ్యాధులు, నీటి నిర్వహణ, విత్తన యాంత్రీకరణ పాత్ర, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పత్తి సాగుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. విజయ్‌కుమార్, కేవీకే సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ చంద్రకాంత్, డాక్టర్ ఏఆర్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న భాగ్యలక్ష్మి

మలక్‌పేట: మూసీ పరిసర ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. దోమలు పెరిగి బస్తీలు, కాలనీవాసులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా మంగళవారం సంబంధిత శాఖ అధికారులతో కలిసి ఆమె మూసీ తీర ప్రాంతాల్లో పర్యంటించారు. ఎంటమాలజీ సిబ్బంది మూసీ పరిసరాల్లో పేరుకుపోయి చెత్త, వ్యర్థాలు, గుర్రపు డెక్క తొలగించి ఆయిల్ బాల్స్‌ను నీటిలో వేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతీ రోజూ శానిటైజేషన్, ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సూచించారు. కార్పొరేటర్ వెంట ఎంటమాలజీ ఇన్‌స్పెక్టర్ గుండప్ప, సిబ్బంది సురేష్, వినయ్, రాజు, దిలీప్, నాగరాజు, సత్యనారాయణ, ప్రదీప్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న వంశీవర్ధన్‌రెడ్డి

మన్సూరాబాద్: ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ముందస్తు అడ్మిషన్లపై చర్యలు చేపట్టాలని ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. డివిజన్ పరిధి హయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకముందే ముందస్తుగా అడ్మిషన్ల పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ఈ దోపిడీని అరికట్టి ఆయా విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రావణి, వెంకటేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహా రుద్రాభిషేకం




మహారుద్ర పారాయణం చేస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని శ్రీశృంగేరి జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం (శ్రీ శృంగేరి శంకరమఠం)లో సువర్ణభారతీ మహోత్సవంలో భాగంగా 1311 రుద్రములతో శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి రుద్రపారాయణ సహిత విశేష రుద్రాభిషేకం కొనసాగుతుంది. మహాశివరాత్రి పురస్కరించుకొని లోక కల్యాణ కోసం రుద్ర పారాయణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం(నేడు) మహా శివరాత్రి విశేష షట్‌కాల పూజ, సామూహిక రుద్రాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దేప భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ బంగారయ్య, సూర్యనారయణ శర్మ, గౌరిభాస్కర్, సుధాకర్ శర్మ, శోభనాద్రి, నరసింహమూర్తి, వ్యాప్‌కుమార్ పాల్గొన్నారు.

బాలలకు ప్రత్యేకంగా 'మయోపియా' క్లినిక్ ప్రారంభం


సాక్షి, హైదరాబాద్: బాలల నేత్ర సంరక్షణను దృష్టిలో పెట్టుకుని దేశంలోని ప్రముఖ నేత్ర చికిత్సా సంస్థ 'సెంటర్ ఫర్ సైట్' ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ప్రత్యేకంగా 'మయోపియా' క్లినిక్ మంగళవారం ప్రారంభమైంది. ఈ క్లినిక్‌ను శిశు వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, పిల్లల నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ మోహన్ కన్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిజిటల్ ఎక్స్‌పోజర్ పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారుల్లో మయోపియా, అస్టిగ్మతిజం వంటి కంటి సమస్యలు అధికమవుతున్నాయన్నారు. మయోపియా క్లినిక్‌లో ఆధునిక వైద్య పద్ధతుల ద్వారా పిల్లలకు ప్రామాణిక కంటి చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. సాధారణ కంటి ఆసుపత్రులతో పోల్చితే మయోపియా క్లినిక్‌లో ప్రత్యేక నిర్ధారణ, సత్వర చికిత్స, నిపుణుల సమగ్ర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. తొలిసారిగా హైదరాబాద్‌లో మయోపియా క్లినిక్‌ను ప్రారంభించామన్నారు.



ముక్కంటి దర్శనానికి ఆలయాలు ముస్తాబు

మన్సూరాబాద్: మహాశివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని పలు శైవక్షేత్రాలు ప్రత్యేక అలంకరణతో ముస్తాబవుతున్నాయి. సెంట్రల్‌బ్యాంక్‌కాలనీలోని ఉమా నాగలింగేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుంచి రుద్రాభిషేకాలు,


- ఉదయం 11 లకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లింగోద్భావకాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సహారాస్టేట్స్‌కాలనీలోని లలితా నాగ నాగలింగేశ్వరాలయం, నాగోలు డివిజన్ పరిధి సౌత్‌ఎండ్‌పార్కు కాలనీలో శివాలయంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.
- హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్టపై ఉన్న భద్రకాళీ రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గుట్టపైకి వెళ్లేందుకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.



విద్యుత్ దీపాలతో ముస్తాబైన ఉమానాగలింగేశ్వర స్వామి దేవాలయం

మలక్‌పేట్‌జోన్ పరిధిలో..

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్‌జోన్ పరిధిలోని శివాలయాలను ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, మలక్‌పేట్, సైదాబాద్, ఓల్డ్‌మలక్‌పేట్, మాదన్నపేట తదితర ప్రాంతాల్లోని శివాలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. శివాలయాలలో భజనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, అర్ధరాత్రి లింగోద్ధరణ, శివ పార్వతుల కళ్యాణ మహోత్సవానికి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, గడ్డిఅన్నారం, ఐఎస్‌సదన్ వివిధ ప్రధాన చౌరస్తాలలో పండ్లు, పూల కోసం వినియోగదారులతో కిటకిటలాడాయి. సాధారణ రోజుల కన్నా మూడింతలు అధిక ధరలకు అమ్ముతున్నారు.



అక్బర్‌బాగ్ పల్టాన్‌లోని శ్రీహరిహరక్షేత్రం

- మహాశివరాత్రికి పూజ, ఉపవాసం కోసం ఉపయోగించే కర్జురాలు కిలో రూ. 100 నుంచి 160, పుచ్చకాయలు ఒక్కొంటికి రూ. 40–65 వరకు, ద్రాక్ష కిలో రూ. 90–130 వరకు, అరటిపండ్లు డజను రూ. 55, యాపిల్ ఒక్కటి రూ. 25–30 అన్ని పండ్లను రెట్టింపు ధరలకు విక్రయించారు.

హయత్‌నగర్‌లో..

హయత్‌నగర్: హయత్‌నగర్‌లో స్వయంభూగా వెలిసిన రామలింగేశ్వర ఆలయాన్ని ముస్తాబు చేశారు. హయత్‌నగర్ తూర్పు దిక్కున ఉన్న పురాతనమైన దేవాలయంలో స్వయంభూగా వెలిసిన శివలింగం ఎంతో మహిమ గలదని స్థానికుల నమ్మకం. ప్రతి శివరాత్రికి ప్రత్యేక పూజలు, ఉత్సవాలను నిర్వహిస్తున్నారు మరొసటి రోజు శివ పార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా జరుగుతోంది.

సోమనాథ క్షేత్రంలో శివరాత్రి వేడుకలు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని శ్రీ సోమనాథ క్షేత్రంలో బుధవారం మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు క్షేత్రం ప్రతినిధులు కౌశిక్ మహర్షి, రఘురాములు, సంజీవయ్య తెలిపారు. శివరాత్రిని పురస్కరించుకుని యజ్ఞ, యాగాలు, అఖండ మహా మృత్యుంజయ యాగం, మధ్యాహ్నం ప్రసాద వితరణ, రాత్రి మహాన్యాసపూర్వక శత ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

లక్ష్యసాధనకు ఏకాగ్రతతో కృషి చేయాలి



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

చాదర్‌ఘాట్: విద్యార్థులు అధునాతన సాంకేతికతను ఒడిసిపట్టుకొని తమ లక్ష్యసాధనకు ఏకాగ్రతతో కృషి చేయాలని శ్రీవాణి మహిళా కళాశాల కరస్పాండెంట్ సుభాష్‌గౌడ్ సూచించారు. మలక్‌పేటలోని సిమ్లా ఫంక్షన్‌హాల్లో మంగళవారం నిర్వహించిన ఫేర్‌వెల్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, దృఢసంకల్పంతో అనుకున్న దానిని సాధించ వచ్చన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విమలారెడ్డి, అధ్యాపకులు గిరిధర్, అనుప్రియ, జాన్, కార్తీక్‌లాల్, రాములు, సీతా మహాలక్ష్మి, హమీద్‌ఖాన్, బిందు, శాంతివర్మ, తిరుమల్‌గౌడ్, శ్రావణి, శ్రీలక్ష్మి, సవిత ఠాగూర్, నాగరాజ్, సిబ్బంది రమేష్, అనంద్ పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ శ్రీలక్ష్మీనగర్ కాలనీలోని షిర్డీ సాయిబాబా మందిరం వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. మూడ్రోజులుగా సాగుతున్న ఉత్సవాల చివరి రోజైన మంగళవారం ఆలయంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు బాబా వారి నిజపాద స్పర్శ దర్శనం కల్పించారు. ఓం ఆదిపరాశక్తి పీఠం వ్యవస్థాపకులు స్వామి ఓం స్వరూపాజీ ఆధ్వర్యంలో భక్తులతో అష్టోత్తర శత వెండి కలశాలతో శ్రీసాయినాథుడికి క్షీరాభిషేకం, పుష్పసారం, పన్నీరుతో అభిషేకం నిర్వహించారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు



సైదాబాద్: సిమెంట్ వ్యాపార రంగంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగంగా ఉంటుందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహెర్ పేర్కొన్నారు. మంగళవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీ రహదారిపై ఉన్న శ్రీజగదీశ్వరీ ట్రేడర్స్ డీలర్ షాపులో ఏర్పాటు చేసిన తాపీ మేస్త్రీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అన్నారు. ఈ సందర్భంగా ఆయన జగదీశ్వరీ ట్రేడర్స్ యజమాని శ్రీనివాస్‌తో కలిసి తాపీ మేస్త్రీలకు రూ. ఒక లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. డీలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, భారతీ సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందన్నారు.

ఉత్సాహం.. వార్షికోత్సవం



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఆర్క్ ప్రీ స్కూల్(ఆర్టిస్టిక్ క్లిక్ ది ప్రీ స్కూల్) వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది జాన్సీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా చిన్నారులకు మెరుగైన విద్యాతో పాటు వారిలోని ప్రతిభను గుర్తించి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకురాలు ప్రిన్సిపాల్ నీలిమ, కో ఫౌండేషన్ చక్రీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చైతన్యపురి: కాలనీల్లో నూతన లైన్లు వేసి డ్రైనేజీ, తాగునీటి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. మంగళవారం డివిజన్‌లోని మారుతీనగర్ కాలనీలో వాటర్‌వర్క్స్ డీజీఎంతో కలిసి పర్యటించారు. రోడ్‌నంబర్–2, 12ఎఫ్‌లలో చాలా రోజులుగా డ్రైనేజీ, తాగునీటి సమస్య ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. 300 ఎంఎం కొత్త డ్రైన్‌లైన్ మంజూరు చేసి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని కార్పొరేటర్ డీజీఎంను కోరగా వెంటనే నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే రోడ్ నం–12ఎఫ్‌లో కొత్త వాటర్ లైన్‌ను డీఏ లైన్‌గా మారుస్తామని డీజీఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ లైన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, గల్బర్ ఇన్‌చార్జి శ్రీకాంత్ స్థానిక నాయకులు నవీన్‌యాదవ్, ఉపేందర్, అంజిబాబు, రాజేష్, కులదీప్, కాలనీ అధ్యక్షుడు రవి కార్యదర్శి ప్రభాకర్, కోశాధికారి శ్రీనివాస్ కృష్ణ, రవి కేశవ్, సత్తయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

